# ప్రలోభాలతో ప్రచారాలు

**-ఓటుకు నోటు,మద్యం సీసా**



**బషీరాబాద్ నవంబరు27,ప్రభాతవార్త :**
ఎన్నికల ప్రచారం గడువు సమీపిస్తుండడంతో బషీరాబాద్ మండల పరిధిలోని ఆయా గ్రామాలలో ఇరు పార్టీల మండల నాయకులు ప్రచారం ముమ్మరంగా కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో గడప,గడపకు తిరుగుతూ ఓటుకు నోటు,మద్యం సీసాలు పంచుతున్నారు. ఒక ఇంటిలో ఎంత మందికి ఓటు హక్కు ఉంది? వారు ఎక్కడ ఉంటున్నారు? పట్టణాల్లో ఉంటే ఓటు వేయటానికి వస్తారా ? లెక్కలు వేసి మరి ఓట్లకు లెక్క గట్టి డబ్బులు పంచుతున్నారని ఓటర్లు పేర్కొన్నారు.

# అసంతృప్తిలో ఓటర్లు

**-అభ్యర్థుల జేబులు గుల్లచేస్తున్న చోటమోట నాయకులు**

**-ఓటర్ల పేరుతో జేబులు నింపుకుంటున్న నాయకులు**

**బషీరాబాద్ నవంబరు27,ప్రభాతవార్త :** పట్టణంలో ఉంటున్న గ్రామస్థుల వివరాలను ఆయా గ్రామాల నాయకులు ఓటర్లా పేర్లను సేకరించి ఎమ్మెల్యే అభ్యర్థుల నుండి కాసులు రబడుతున్నారు. ఓటర్లా జాబితాను ఎమ్మెల్యే ముందు ఉంచి తమ గ్రామానికి చెందిన ఓటర్లు ఇంతమంది జీవనోపాధి కోసం మహానగరంలో ఉంటున్నారని వారిని రప్పించేందుకు రవాణా ఖర్చులు ఇవ్వాలని ఎమ్మెల్యే అభ్యర్థుల నుండి డబ్బులు తీసుకుంటున్నారు. పట్టణాల్లో చిన్న చిన్న విందులు ఏర్పాటు చేసి ఫలానా వ్యక్తికి ఓటు వేయాలని కోరుతున్నారు. ఇక్కడి వరకు ఒక అభ్యర్థికి మద్దతు తెలిపిన సదురు వ్యక్తి మరో ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గరకు వెళ్లి ఇదే పాట పడుతూ అభ్యర్థిని మెప్పిస్తూ కాసులకు కక్కుర్తి పడి ఓటర్లను మోసాగిస్తున్నారు. పట్టణాల్లో ఏర్పాటు చేసిన సమావేశాలకు వచ్చిన ఓటర్లు ఆ నాయకుడి పరిస్థితులు గమనించి ముక్కున వేలేసుకుంటున్నారు. ఇటు ఓటర్లను అటు అభ్యర్థులను మెప్పిస్తున్న నాయకులు పైసలు తీసుకొని పక్కకు జారుకుంటున్నారని ఓటర్లు నిరాశ చెందుతున్నారు. నాయకులు ఆడుతున్న నాటకాలకు ఇటు అభ్యర్థులు అటు ఓటర్లు నష్టపోతున్నారు. అభ్యర్థులు నాయకులపై దృష్టి సారించకపోతే ఇటు నోట్లు అటు ఓట్లు కోల్పోయే అవకాశం లేకపోలేదు.



**రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్**

**వార్త**

## ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఖచ్చితంగా పాటించాలి : కలెక్టర్ గౌతమ్

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి నవంబరు 27, ప్రభాతవార్త**
ఎన్నికల ప్రవర్తన నియమావళిని ప్రతి ఒక్కరు ఖచ్చితంగ పాటించాలని మేడ్చల్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ స్పష్టం చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని ప్రతి ఒక్కరు తూచతప్పకుండ పాటించాలని సూచించారు. ఎన్నికల నిర్వాహణలో భాగంగ వివిధ రాజకీయ పార్టీలు తాము చేస్తున్న బహిరంగ సభలు, ఎస్ఎంఎస్ ప్రచారాలను ఎన్నికల నిబంధనల ప్రకారం 48గంటల వ్యవధిలో భాగంగ ఈ నెల 28వ తేదీన సాయంత్రం 5గంటలకు ప్రచారాలను ముగించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం 72గంటల వ్యవధిలో ఎన్నికల నిర్వాహణ ప్రక్రియపై పూర్తి స్థాయిలో నిఘా నిర్వహించాలన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా పకడ్బంధీగ ఏర్పాట్లు చేయాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియామావళిని నిబంధనలను ఉల్లంఘించినట్లైతే భారత ఎన్నికల సంఘం నిబంధనల మేరకు కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ స్పష్టం చేశారు.



చేవెళ్లలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న చేవెళ్ల బిఆర్ఎస్ అభ్యర్థి కాలే యాదయ్య


చేవెళ్లలో ప్రజాఆశీర్వాద సభకు వచ్చిన సిఎం కెసిఆర్‌కు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలుకుతున్న చేవెళ్ల బిఆర్ఎస్ అభ్యర్థి కాలే యాదయ్య

# చేవెళ్ల నియోజకవర్గంలో మరిన్ని పరిశ్రమలు ఏర్పాటు చేయాలి

**-రాష్ట్రం కోసం ప్రాణాలను సైతం లెక్క చేయని నేత సిఎం కెసిఆర్**
**-ఆలూరులోని ప్రభుత్వ భూమిలో ఫ్యాక్టరీని మంజూరు చేయాలి**
**-111జీఓ రద్దుపై శాశ్వతమైన పరిష్కారం చేయాలి**
**-చేవెళ్ల ప్రజాఆశీర్వాద సభలో చేవెళ్ల బిఆర్ఎస్ అభ్యర్థి కాలే యాదయ్య**

**చేవెళ్ళ, నవంబర్ 27, ప్రభాతవార్త**
రాష్ట్రం కోసం ప్రాణత్యాగనికైన సిద్ధమైన నాయకుడు సిఎం కెసిఆర్ అని, రైతుల కోసం నిరంతరం పాటుపడుతున్న మహనుబావుడు సిఎం కెసిఆర్ ఒక్కరే అని చేవెళ్ల బిఆర్ఎస్ అభ్యర్థి కాలే యాదయ్య అన్నారు. సోమవారం చేవెళ్లలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో సిఎం కెసిఆర్ పాల్గోన్నారు. ఈ సందర్భంగా చేవెళ్ల బిఆర్ఎస్ అభ్యర్థి కాలే యాదయ్య మాట్లాడుతూ.. చేవెళ్లలో చాలా వెనుకబడి ఉందని, దళిత బందు ప్రతి ఒక్కరికి అందించాలని, 111 జీఓను కూడ రద్దు చేశారని, ప్రజల్లో ఇంకా అపూహ ఉందన్నారు. ఆలూరులో 1200 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, ఆలూరులో మరోక కంపనీని ఏర్పాటు చేయాలన్నారు. చేవెళ్ల-వికారాబాద్ మద్యలో 500 ఎకరాలు ఉందని, మొయినాబాద్ మండలంలో కూడ ప్రభుత్వ భూములున్నాయని, అక్కడ కంపనీలు ఏర్పాటు చేయాలన్నారు. రైతులు తమ సమస్యలను చర్చించుకునేందుకు రైతు వేదికలను కట్టించామన్నారు. రాష్ట్రంలోని 33 జిల్లాలో కలెక్టరేట్‌లను కట్టించిన ఘనత సిఎం కెసిఆర్‌కు మాత్రమే దక్కిందన్నారు. చేవెళ్ల పరిసర ప్రాంతాల్లో అనేక కంపనీలు వచ్చాయని, ఇంకా కంపనీలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పాటుపడుతున్న బిఆర్ఎస్ ప్రభుత్వంను మళ్లీ గెలిపించాలన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఎంపి రంజీత్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ తీగల అనితారెడ్డి, చేవెళ్ల ఎంపిపి మల్గారి విజయలక్ష్మీ, జడ్‌పిటిసి మర్పల్లి మాలతీ, మండల పార్టీ అద్యక్షుడు పెద్దోళ్ల ప్రభాకర్ తదితరులు పాల్గోన్నారు.

# కీసరగుట్టకు కార్తీక శోభ ...


కీసరగుట్టలో శివలింగానికి నీళ్లతో అభిషేకం చేస్తున్న భక్తులు

**-ఉదయం 4 గంటల నుండి స్వామి వారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు**
**-భక్తులతో కిటికిటలాడిన కేసరగిరి క్షేత్రం**
**-గర్భాలయంలో స్వామివారికి అభిషేకాలు నిలిపివేత**
**-కార్తీక పౌర్ణమి సందర్భంగా లక్ష మంది భక్తులు దర్శించుకున్నట్లు అంచనా**
**-భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేసిన చైర్మన్**


కీసరగుట్టలో గోపురం ముందు శివలింగానికి అభిషేకాలు చేస్తున్న భక్తులు


కార్తీక దీపం వెలిగించి ద్యానం చేస్తున్న యువతి

**కీసర,నవంబరు27,ప్రభాతవార్తః**
తెలంగాణాలోనే సుప్రసిద్ధ శైవక్షేత్రమైన కీసరగుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా సోమవారం భక్తులతో పోటెత్తిపోయింది. సోమవారం శివునికి అత్యంత ప్రీతికరం అయిన రోజు కావడం అలాగే కార్తీక పౌర్ణమి సందర్భంగా సెలవు ఉండటంతో భక్తులు ఉదయం 4 గంటల నుండే క్యూ లైన్లలో నిండిపోయారు. కార్తీక పౌర్ణమి తిథి మధ్యాహ్నాం వరకు ఉండటంతో భక్తులు ఉదయం నుండె స్వామి వారిని దర్శించుకునేందుకు నగరం నలు మూలల నుండి తరలి వచ్చిన భక్తులతో కేసరిగిరి ప్రాంతాలు కిటకిటలాడాయి. గర్భాలయంలో స్వామి వారికి అభిషేకాలు రద్దు చేసినప్పటికి వివిఐపి లైన్లలో భక్తులు చాలా ఇబ్బందులు పడ్డారు. కీసరగుట్ట ప్రాంతం ఎటు చూసినా భక్తుల శివలింగ అభిషేకాలు, కార్తీక దీపారాధనలతో నిండిపోయింది. సోమవారం ఒక్క రోజే లక్ష మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు అంచనా. క్యూలైన్ల ప్రవేశాల వద్ద తెల్లవారుఝూము నుంచి రాత్రి వరకు భక్తుల రద్దీ కనిపించింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ చైర్మన్ తటాకం రమేష్‌శర్మ, ఈఓ నరేందర్ అన్ని ఏర్పాట్లు చేశారు.

**ఘనంగా స్వామి వారికి రుద్రాభిషేకంః**
కీసరగుట్టలో స్వామి వారికి కార్తీక మాస ప్రత్యేక పూజలలో భాగంగా సోమవారం గర్భాలయంలోని శివలింగానికి రుద్రాభిషేకం,(చెఱుకు) ఇక్షు రసాభిషేకం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ప్రత్యేక పూజలలో ఆలయ చైర్మన్ తటాకం రమేష్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.


కార్తీక దీపాలు వెలిగించి స్వామి వారిని మొక్కుతున్న దంపతులు

## అభ్యర్థుల ఖర్చు వివరాలు పకడ్బందీగా నమోదు చేయాలి

**-పారదర్శకంగా జరిగేలా ఎన్నికల నిర్వహణకు చర్యలు చేపట్టాలి**
**-భారత ఎన్నికల సంఘం స్పెషల్ ఎక్స్పెండీచర్ పరిశీలకులు బిఆర్ బాలకృష్ణణ్**
**-పాల్గొన్న మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్**



మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో ఎన్నికల నిర్వాహణపై భారత ఎన్నికల సంఘం స్పెషల్ ఎక్స్పెండీచర్ పరిశీలకులు బిఆర్ బాలకృష్ణణ్ సమీక్షించగ పాల్గొన్న కలెక్టర్ గౌతమ్, పలువురు పరిశీలకులు,అధికారులు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి నవంబరు 27, ప్రభాతవార్త**
ఎన్నికలలో అభ్యర్థుల ఖర్చులు, వివరాలను పకడ్భంధీగ నమోదు చేయాలని, ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగ జరిగేలా అన్ని చర్యలు తీసుకోవాలని భారత ఎన్నికల సంఘం స్పెషల్ ఎక్స్పెండీచర్ పరిశీలకులు బిఆర్ బాలకృష్ణణ్ స్పష్టం చేశారు. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌ను ఆయన సందర్శించారు. జిల్లా వ్యాప్తంగ ఉన్న ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఏర్పాట్లపై జిల్లాకు వచ్చిన ప్రత్యేక వ్యయ పరిశీలకులు ప్రేమ్ ప్రకాశ్‌మీనా, బాలాసాహెబ్ బాపూరావు, రాచకొండ అదనపు పోలీస్ కమిషనర్ తరుణ్‌జోషి, డిసిపిలు శబరీష్, జానకి, ఎంసిసి, ఎంపిఎంసి, జిఎస్‌టి, ఇన్‌కంటాక్స్, వాణిజ్యపన్నుల శాఖ, ఎక్సైజ్‌శాఖ, ఎల్‌డిఎం, వ్యయపరిశీలన నోడల్ అధికారి, సహాయ వ్యయ పరిశీలకులతో ఆయన ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగ జిల్లా కలెక్టర్ గౌతమ్ ఎన్నికల నిర్వాహణ కోసం చేపట్టిన ఏర్పాట్ల గురించి పవర్‌పాయింట్ ప్రజేంటేషన్ ద్వారా రాష్ట్ర పరిశీలకులకు వివరించారు. ఈ సందర్భంగ కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసిసి) ఎన్నికల్లో అక్రమంగ నగదు పంపిణీ, మద్యం, డ్రగ్స్ వంటి చట్టవిరుద్ధమైన కార్యక్రమాలు జరగకుండ ఎస్ఎస్‌టి, ఎఫ్ఎస్‌టి బృందాలు ఇప్పటి వరకు చేసిన కేసులు, పనులకు సంబంధించి పూర్తి వివరాలను తెలియజేశారు. సి.విజిల్ యాప్ ద్వార ఇప్పటి వరకు 381 ఫిర్యాదులు రాగ వాటికి సంబంధించి సమస్యలు పరిష్కరించినట్లు అధికారులు తెలిపారు. కంట్రోల్‌రూమ్, వచ్చె ఫిర్యాదులు, చేపడుతున్న చర్యలను తెలిపారు. ఎలక్ట్రానిక్,ప్రింట్, సోషల్‌మీడియాలో మీడియాలలో ప్రకటనలు డిఎవిపి , డిఐపిఆర్ రేట్లు, ఎన్నికలకు సంబంధించిన ప్రకటనలు, సోషల్ మీడియా, ఫేక్ న్యూస్, పెయిడ్ న్యూస్ వివరాలను తెలిపారు. సామాజిక మాద్యమాలలో ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై ప్రత్యేక దృష్టి సారించాలని, సోషల్ మీడియా సెల్ యాక్టీవ్‌గ పనిచేస్తుందని ఎన్నికల ప్రక్రియ మొత్తం పూర్తి వరకు కొనసాగించాలని, వాటికి సంబంధించి ఎప్పటికపుడు రికార్డు చేస్తున్నామని అధికారులు వివరించారు. స్పెషల్ ఎక్స పెండీచర్ పరిశీలకులు బిఆర్ బాలకృష్ణన్ పేర్కొంటూ అన్ని రకాల నగదు, మద్యం, బహుమతులపై ప్రత్యేక నిఘా పెంచాలని, పోటీలో ఉన్న అభ్యర్థుల బ్యాంకు ఖాతాలను పరిశీలించి అవసరమైన తగు చర్యలు తీసుకోవాలన్నారు. అనుమానిత బ్యాంకు లావాదేవీలు, లక్ష దాటిన ట్రాన్స క్షన్స్ పట్లపరిశీలించాలని బ్యాంకులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో గట్టి నిఘా పెంచాలని అన్నారు. జిల్లాలో చేపట్టిన ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ గౌతమ్, అదనపు పోలీ స్ కమిషనర్ తరుణ్‌జోషి, డిసిపి శబరీష్, పిపిటి ద్వారా పరిశీలకులకు వివరించారు.

# కాంగ్రెస్, బీజేపీలను నమ్మితే... ఐదేళ్లు గోసపడుతాం

**-మహేశ్వరం బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సబితాఇంద్రారెడ్డి**


రోడ్డుషోలో మాట్లాడుతున్న మంత్రి సబితారెడ్డి.

**మహేశ్వరం, నవంబర్ 27 (ప్రభాతవార్త) :**
కాంగ్రెస్, బీజేపీలను నమ్మి ఓటేస్తే ఐదేళ్ల గోసపడుతామని మంత్రి,మహేశ్వరం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సబితాఇంద్రారెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా జల్‌పల్లి రోడ్‌షోలో పాల్గొన్నారు. మహేశ్వరం బిఆర్ఎస్ అభ్యర్థి సబితాఇంద్రారెడ్డికి ఘనస్వాగతం పలికారు. ప్రచారంలో ఆమె ఓటర్లకు కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... జల్‌పల్లి మున్సిపాలిటి అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యమన్నారు. ముఖ్యమంత్రి కేసిఆర్ ఈ ప్రాంతంపై ప్రత్యేక అభిమానం ఉందని, ఈ ప్రాంత అభివృద్ధికి కోట్టాడి నిధులు కేటాయించారన్నారు. మరింత అభివృద్ధి జరగాలంటే కారు గుర్తుకు ఓటు వేసి ఆశీర్వదించండి..మీ ఆడబిడ్డగా అండగా ఉంటానని తెలిపారు. ఈ ప్రాంతంలో ఐటి హబ్ ఏర్పాటు చేయటానికి ముఖ్యమంత్రి కేసిఆర్ నిర్ణయించారు. ఐటి కంపెనీల రాకతో ఈ ప్రాంత రూపురేఖలు పూర్తిగా మారిపోతాయని, కాంగ్రెస్, బిజెపిల మాయమాటలు నమ్మి మోసపోవద్దని ఆమె అన్నారు. తెలంగాణలో రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి బీఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమన్నారు. ఆశీర్వదించి మరోమారు ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గంను మరింత అభివృద్ధి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు కృషి

**-జిల్లాలో నేటి సాయంత్రం నుంచి 144 సెక్షన్ అమలు**
**-జిల్లా ఎన్నికల అధికారి నారాయణరెడ్డి**


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి సి. నారాయణరెడ్డి, జిల్లా ఎస్పీ కోటిరెడ్డి

**వికారాబాద్,నవంబర్ 27, ప్రభాతవార్త:**
ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు తమ వంతు కృషి చేస్తున్నామని, ఆయా పార్టీల నాయకులు, ప్రజలు సైతం అధికారులకు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచి ఎన్నికల ప్రచారం ముగుస్తుందని, ఆయా పార్టీల అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులు ఎన్నికల ప్రచారాన్ని సాయంత్రం 5 గంటల తర్వాత చేయరాదని సూచించారు. జిల్లాలో 1133 పోలింగ్ బూతులకు సంబంధించిన డిస్ట్రిబ్యూషన్ సామాగ్రిని 29 సాయంత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. పోలింగ్ సిబ్బందికి ఐడీ కార్డులను ఇవ్వడంతో పాటు పోలింగ్ సామాగ్రిని ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. 125 శాతం ఈవీఎం లు అందుబాటులో ఉంచడం జరిగిందని, ఈ అసెంబ్లీ ఎన్నికల్లో వినియోగించే ఈవీఎం యంత్రాలు కొత్త వాటిని వినియోగిస్తున్నట్లు తెలిపారు. ఈవీఎం లు ఏవైన మొరాయించినట్లైతే కేవలం 15 నిమిషాల వ్యవధిలో పరిష్కరించే దిశగా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవడం జరిగిందన్నారు. మాక్ పోలింగ్ 30 వ తేదీ ఉదయం 5.30 గంటలకు ప్రారంభం అవుతుందని, 50 ఓట్లు వేసి ఈవీఎం యంత్రాలను చెక్ చేయడం జరుగుతుందని వివరించారు. అనంతరం మాక్ పోలింగ్ ఫలితాలను అన్నింటిని డిలీట్ చేసి ఉదయం 7 గంటలకు నిజమైన పోలింగ్ ప్రారంభం అవుతుందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని ఓటర్లకు 95 శాతం ఓటర్ స్లిప్పులు పంపిణీ చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఓటరుకు స్లిప్పులతో పాటు ఓటర్ గౌడ్, సి-విజిల్ యాప్‌కు సంబంధించి కర పత్రాలను ఇచ్చినట్లు తెలిపారు. పోలింగ్ బూతులోకి ఓటు వేసేందుకు వచ్చే ఓటరు మొబైల్ ఫోన్, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు ధరించి రాకూడదని సూచించారు. ఓటరు స్లిప్‌తో పాటు ఆధార్‌కార్డు,రేషన్ కార్డు, భూమి పాస్‌బుక్, బ్యాంకు పాస్‌బుక్, డ్రైవింగ్ లైసెన్సు వంటి 13 రకాల ఐడీ ప్రూఫ్‌లకు సంబంధించి ఏదైన ఒక కార్డు చూపించి ఓటు వేయాల్సి ఉంటుందన్నారు. ప్రస్తుతం నియోజకవర్గాల వారిగా ఫ్లైయింగ్ స్కాడ్ సంఖ్యను రెండింతలు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. 29, 30 తేదీలలో ప్రకటనలు ఇవ్వదలిచిన అభ్యర్థులు ముందస్తు అనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలలో డిబేట్స్, చర్చలు, ఇంటర్వ్యూలు చేయరాదని,గెలుపు, ఓటమిలపై విశ్లేషణాత్మక కథనాలు సైతం నిషేధం విధించినట్లు తెలిపారు. పోలింగ్ రోజు అభ్యర్థులు, రాజకీయ పార్టీల వారు ఓటర్లను తరలించరాదని, వికలాంగులు, వృద్ధుల కోసం పోలింగ్ స్టేషన్ పరిధిలో వాహనాలను సైతం సిద్ధంగా ఉంచడం జరిగిందని పేర్కొన్నారు. ఏవైన ఇబ్బందులు తలెత్తితే 1950 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. జిల్లా ఎస్పీ ఎన్.కోటిరెడ్డి మాట్లాడుతూ, జిల్లాలో 28 సా యంత్రం 5 గంటల నుంచి 30 తేదీ వరకు 72 గంటల పాటు 144 సెక్షన్ అమల్లో ఉం టుందని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా 2,500 మంది పోలీసు సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొనడం జరుగుతుందని పేర్కొన్నా రు. 84 రూట్‌లను తాము ఎంపిక చేసుకోవడం జరిగిందని, ప్రతి రూట్‌లో పోలీసు అధికారితో పాటు ఆర్మ్‌డ్ పోలీసులు, సెంట్రల్ ఫోర్స్, సీఆర్‌పీఎఫ్ పోలీసు సిబ్బంది ఉంటారని అన్నారు. ఇప్పటికే 6 కంపెనీల పోలీసు బలగాలు వచ్చాయని, మరో 6 కంపెనీల బలగాలు రానున్నట్లు తెలిపారు. తమ వద్ద వెయ్యి మంది పోలీసు సిబ్బంది ఉండగా, మరో వెయ్యి సిబ్బంది రానున్నారని పేర్కొన్నారు. ఎన్నికల విధుల్లో భాగంగా ఇప్పటి వరకు 4,15 కోట్ల నగదు, 4 వేల లీటర్ల లిక్కర్, 45 తొలాల బంగారు ఆభరణాలు సీజ్ చేసినట్లు వివరించారు. మంగళవారం సాయంత్రం 5 గంటల తర్వాత ఎన్నికల ప్రచార నిమిత్తం వచ్చిన స్థానికేతరులు ఇక్కడి నుంచి వెళ్ళిపోవాల్సి ఉంటుందని, ఇందులో భాగంగా లాడ్జ్‌లు, హోటళ్లలో తనిఖీలు చేయనున్నట్లు చెప్పారు. ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని

## చీర్యాల లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు


ఆలయ ప్రాంగణంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు చేస్తున్న భక్తులు

**కీసర, నవంబరు27,ప్రభాతవార్తః**
శ్రీశ్రీశ్రీ చీర్యాల లక్ష్మీనృసింహ్మ స్వామి దేవాలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా సోమవారం భక్తులతో నిండిపోయింది. నగరం నలుమూలల నుండి వచ్చిన భక్తులు పెద్ద ఎత్తున ఆలయంలో సా మూహిక సత్యనారాయణ వ్రతాలు జరిగాయి. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని దేవాలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగించారు. అనంతరం స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



కవాతు దృశ్యం

## నిజాంపేటలో కేంద్ర బలగాల కవాతు

**నిజాంపేట, నవంబర్ 27, ప్రభాతవార్త :** మండల కేంద్రంలో సోమవారం రామాయంపేట సీఐ లక్ష్మిబాబు ఆధ్వర్యంలో కేంద్ర బలగాలతో పోలీస్ కవాతు నిర్వహించరు. ఈ మేరకు నిజాంపేటలో కేంద్ర బలగాలతో గాంధీ విగ్రహం నుంచి నూతన బస్టాండ్‌వరకు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ లక్ష్మిబాబు మాట్లాడుతూ ఈనెల 30న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రజలు శాంతియుత వాతావరణంలో ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ వేణుగోపాల్, కేంద్ర బలగాలు పాల్గొన్నారు.

## మల్లికార్జునస్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి శోభ



మల్లికార్జున స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

**వెల్దుర్తి, నవంబర్ 27 ప్రభాతవార్త:** మండల పరిధిలోని బస్వాపూర్ వద్ద వెలసిన శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయంలో సోమవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేకంగా ఈ ఆలయంలో పుట్టు లింగం ఉండటంతో భక్తులు దర్శించుకొని అనుకున్న పనులు జరుగుతాయనే నమ్మకంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరిసర ప్రాంత భక్తులు భారీగా చేరుకొని అభిషేకాలు, అర్చనలు, కుంకుమార్చనలు నిర్వహించారు. అక్కడే ఉన్న ఉసిరి చెట్టు కింద దీపాలు వెలిగిస్తే ఎంతో మోక్షం ఉంటుందనే నమ్మకంతో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని దీపారాధన చేశారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. సాయంత్రం వేళ పరిసర ప్రాంత మహిళలు పాల్గొని లక్ష దీపారాధన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## బొడ్మట్‌పల్లిలో కార్తీక మాస ప్రత్యేక పూజలు

**టేక్మాల్, నవంబరు 27, ప్రభాతవార్త:** మండల పరిధిలోని బొడ్మట్‌పల్లి శ్రీ భద్రకాళీ సమేత వీరభద్ర దేవాలయంలో కార్తీక మాస ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆలయంలో ఏర్పాటు చేసిన దీపారాధన కార్యక్రమంలో పాలుపంచుకొని దీపారాధన చేశారు. ఓం నమశివాయ అంటూ శివనామాస్మరణతో మారుమ్రోగాయి. పంటలు బాగ పండాలని, ఉరువాడ చల్లంగా ఉండాలని వేడుకున్నారు.

## ఘనంగా సిద్దప్ప వరకవి గురుపూజోత్సవం



సిద్దప్ప చిత్ర పటంతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

**కోహెడ, నవంబర్ 27, ప్రభాతవార్త :** మండల పరిధిలోని గుండారెడ్డిపల్లిలో తెలంగాణ వేమనగా ప్రసిద్ధిగాంచిన సిద్దప్ప వరకవి అశ్రమంలో అయన కుమారులు అనంతవరం వీరేశలింగం,మాణిక్యలింగం గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. సోమవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా సిద్దప్ప చిత్రపటంతో భక్తులు, అభిమానులు, శిష్యులు ఊరేగింపుగా వెళ్లారు. ఓం నమశ్శివాయ నామస్మరణతో గ్రామంలోని వీధులన్ని మార్మోగాయి. అనంతరం అశ్రమంలోగల సరస్వతీ అమ్మవారి వద్ద వేదమంత్రాలతో గాయత్రీ యజ్ఞం నిర్వహించారు. సిద్దప్ప సమాధి వద్ద ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. విగ్రహానికి పులమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సిద్దప్ప రాసిన గ్రంథంలోని పద్యాలు పాడుతూ భక్తులు భజనలు చేశారు. ఉమ్మడి మెదక్ జిల్లా, ఉమ్మడి నిజాబాద్ జిల్లాల భకు_లు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో కొక్కుల సురేష్, పాము శ్రీకాంత్, పోలవేని కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు. కాగా సిద్దప్ప వరకవి అశ్రమ అభివృద్ధికి సహకరించిన హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీష్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా అష్టాదశ శక్తిపీఠాల ప్రతిష్ట మహోత్సవం



దేవాలయంలో పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్న భక్తులు

**కొండపాక, నవంబర్ 27, ప్రభాతవార్త :** మండల పరిధిలోని అనంద నిలయం పక్కన అష్టాదశ శక్తిపీఠాల ప్రతిష్ట మహోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. బారత దేశంలో ఎక్కడలేని విధంగా ఉమా రామలిగేశ్వర స్వామి వారితో పాటు అష్టాధశ శక్తిపీఠాలకు సోమవారం తెల్లవారు జామున యంత్ర ప్రతిష్ట, మంత్ర ప్రతిష్ట, విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు నిర్వహించారు. ఈ నెల 25వ తేదిన పూజ కార్యక్రమాలను పుష్పగిరి పీఠాధిపతులు శంకర భారతి మహాస్వామి, మదనానంద సరస్వతీ పీఠాధీశ్వరులు మదవానంద సరస్వతీ స్వామి ఆధ్వర్యంలో ప్రతిష్ట కార్యక్రమాలు నిర్వహించారు. అంతకు ముందు శివపార్వతుల మండపం పై విగ్రహాలు ధాన్యాధివాసం, పుష్పాధివాసం, పాలాధివాసం, శయనించు సేవ ప్రత్యేక దీపాలంకరణ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో దేవాలయ చైర్మన్ కె వి రమణాచారి, దేవాలయ ట్రష్టి సభ్యులు, భక్తులు ఆధిక సంఖ్యలో పాల్గొని అష్టాధశ శక్తిపీఠాలను, ఉమారామలింగేశ్వర స్వామి, ఉమా పార్వతి అమ్మ వారిని, సుబ్రమణ్య స్వామిని దర్శించుకొని పూజ కార్యక్రమాలు నిర్వహించారు.

## పాండవుల చెరువును సందర్శించిన కొట్టాల యాదగిరి

**గజ్వేల్, నవంబర్ 27 (ప్రభాతవార్త):** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని పాండవుల చెరువును ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకుడు కొట్టాల యాదగిరి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాండవుల చెరువువద్ద పార్కును పరిశీలించడంతోపాటు చేపలు పడుతున్న మత్సకారుల వద్దకు వెళ్లి చెరువులో వలవేసి చేపలు పట్టారు. ఆయన వెంట ముదిరాజ్ సంఘం నాయకులు కొట్టమైన నర్సింలు, చందు పాల్గొన్నారు.



చెరువులో చేపలు పడుతున్న ముదిరాజ్ సంఘం రాష్ట్ర నేత కొట్టాల యాదగిరి

# పోరాడి సాధించుకున్న తెలంగాణలో రైతులు, నిరుద్యోగుల ఆత్మహత్యలు ఆగలేదు

### -గడప గడపకు ప్రచారంలో కాంగ్రెస్ అభ్యర్థి భీమ్



మొయినాబాద్ మండలంలోని మోత్కుపల్లి, చిలుకూరు తదితర గ్రామాల్లో గడప గడపకు ప్రచారంలో భాగంగా చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి భీమ్ భరత్

**మొయినాబాద్, నవంబర్ 27 ప్రభాతవార్త:** పోరాడి సాధించుకున్న తెలంగాణలో రైతుల, నిరుద్యోగుల ఆత్మహత్యలు ఆగలేదని చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి భీమ్ భరత్ తెలంగాణ ప్రభుత్వంపై ఘాటుగా విమర్శించారు. రైతులకు బేడీలు వేసి జైలుకు పంపిన దుర్మార్గపు బిఆర్ఎస్ ప్రభుత్వమని మండిపడ్డారు. గడప గడపకు ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ అభ్యర్థి భీమ్ భరత్ మొయినాబాద్ మండలంలోని మోత్కుపల్లి, చిలుకూరు తదితర గ్రామాల్లో సోమవారం పర్యటించారు. ఈ గ్రామాల్లో వేల సంఖ్యలో ప్రజలు ముందుకు వచ్చి స్వాగతించారు. జన నేతకు నీరాజనం పలికారు. ప్రచారం కొనసాగుతుండగా చిలుకూరు గ్రామంలో బిజెపికి చెందిన చందానగర్ గ్రామ ప్రెసిడెంట్ హరేందర్‌గౌడ్, చిలుకూరు గ్రామ బిజెపి కార్యకర్తలు కాంగ్రెస్ అభ్యర్థి భీమ్ భరత్ సమక్షంలో దాదాపు 50 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారందరికి కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం భీమ్ భరత్ మాట్లాడుతూ తన గెలుపు కోసం విశేషం గా కృషి చేస్తున్న వారందరికి అభినందనలు తెలిపారు. కెసిఆర్, వారి తాబేదా ర్లను గద్దె దించాల్సిన ఆవశ్యకతను ప్రజలకు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ తెలం గాణ సమాజానికి ఇచ్చిన హామీల గురించి ప్రచారంలో ప్రత్యేకంగా వివరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ టిపిసిసి రాష్ట్ర నాయకుడు షాబాద్ దర్శన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తమ్మలి మాణయ్య, శ్రీరాంనగర్ గ్రామ ఎంపిటిసి రామ్‌రెడ్డి, కేబుల్ రాజు, మండల ఉపాధ్యక్షుడు మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

**షాబాద్ మండలంలో :** కాంగ్రెస్ పార్టీతోనే అందరికి సమన్యాయం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఎమ్మెల్యే అభ్యర్థి పామెన భీం భరత్ అన్నారు. సోమవారం షాబాద్ మండల పరిధిలోని ఆస్పల్లిగూడ, ఎల్గొండగూడ, చర్లగూడ, బోడంపహాడ్ గ్రామాల్లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, టీపీసీసీ కార్యదర్శులు పీసరి సురేందర్‌రెడ్డి, రాంరెడ్డి, పార్టీ మండలాధ్యక్షులు చంద్రశేఖర్‌లతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎంపీ టీసీలు కుమ్మరి చెన్నయ్య, ఆశోక్, టీపీసీసీ మైనార్టీసెల్ ప్రధాన కార్యదర్శి ఆశ్వక్ అలీ, నాయకులు రవీందర్, అక్తర్‌పాష, పెంటారెడ్డి, వెంకట్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, యాదయ్య, నర్సింలు, చంద్రయ్య, శ్రీనివాస్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, గౌరీశ్వర్, మాజీ సర్పంచులు చెన్నయ్య, యాదగిరి, బుచ్చయ్య, సత్యనారాయణ, రవీందర్ నాయక్, రవి, పెంటయ్య, ఆయా గ్రామాల పార్టీ నాయకులు,ఉన్నారు.

# అదరించడి...అభివృద్ధి చేసి చూపిస్తా

### -చేవెళ్ల బిజెపి అభ్యర్థి కెఎస్ రత్నం



పల్గుట్టలో ఇంటింటికి ప్రచారం చేస్తున్న చేవెళ్ల బిజెపి అభ్యర్థి కెఎస్ రత్నం

**చేవెళ్ళ, నవంబర్ 27, ప్రభాతవార్త**

చేవెళ్ళ నియోజకవర్గంలో బిజెపిని అదరించాలని, అదరిస్తే అభివృద్ది చేసి చూపిస్తానని చేవెళ్ల బిజెపి అభ్యర్థి కెఎస్ రత్నం అన్నారు.సోమవారం చేవెళ్ల మండలం అలూరు, నాన్‌చేరువు, ఖానాపూర్, ఘనాపూర్, దేవరంపల్లి, అల్లావాడ, గుండాల, పల్గుట్ట, కందావాడ, నారాయన్‌దాస్‌గూడ, చన్‌వల్లి, ఇక్కరెడ్డిగూడ, పామెన గ్రామాలల్లో ఎన్నికల ప్రచారంను నిర్వహించారు. ఈ సందర్భంగా చేవెళ్ల బిజెపి అభ్యర్థి కెఎస్ రత్నం మాట్లాడుతూ కాంగ్రేస్,బిఆర్ఎస్‌లను ప్రజలు ఆదరించడం లేదన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం ఊకదుంపుడు ప్రకటనలు చేస్తూ ప్రజలను మోసం చేసేందుకు ముందుకు వస్తున్నారన్నారు.కాంగ్రేస్ ప్రభుత్వ హయంలోను ఏలాంటి అభివృద్ది జరుగలేదన్నారు. నియోజకవర్గంలోని ప్రజలకు సేవ చేసే భాగ్యం కల్పించాలన్నారు.రానున్న ఎన్నికల్లో బిజెపి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. బిఆర్ఎస్ అభ్యర్థి కాలే యాదయ్య అవినీతికి పాల్పడ్డాడని, అవినీతి పాలనకు స్వస్తీ పలుకాలన్నారు.కాంగ్రేస్ అభ్యర్ది బీంభరత్‌ది నేరచరిత్రతో దోపిడి లు హత్యలు చేయడంలో దిట్టన్నారు. దేశంలో బిజెపి ప్రభుత్వం అనేక అభివృద్ది కార్యక్రమాలను చేపడుతుందన్నారు. దేశంలో మరింత అభివృద్ది జరుగాలంటే బిజెని గెలిపించాలన్నారు.

# మేడ్చల్‌లో కాంగ్రెస్ గెలుపు ఖాయం

### -కేరళ మాజీ హోంమంత్రి రమేశ్ చెన్నితాల

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి నవంబరు 27, ప్రభాతవార్త**

మేడ్చల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేశ్‌యాదవ్ గెలుపు ఖాయమని, తెలంగాణలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు తథ్యమని కేరళ రాష్ట్ర మాజీ హోంమంత్రి రమేశ్ చెన్నితాల పేర్కొన్నారు. సోమవారం మేడ్చల్ నియోజకవర్గంలోని కీసర మండలం దమ్మాయిగూడ మున్సిపాల్టీ పరిధిలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగ కేరళ రాష్ట్ర మాజీ హోంత్రి రమేశ్ చెన్నితాల మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కాబోతుందని, ప్రజల నుంచి కాంగ్రెస్ పట్ల మంచి ఆదరణ లభిస్తుందన్నారు. మేడ్చల్ కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేశ్‌యాదవ్ గెలుపు కోసం పార్టీ నాయకులు కష్టపడి పనిచేయాలని మంచి మెజార్టీతో గెలిపించాలని ఆయన సూచించారు. ప్రజల ఆశీర్వాదంతో తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రాబోతుందన్నారు. ఈ సమావేశంలో వారితో పాటు రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

**..కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు తెలిపి కాంగ్రెస్‌లో చేరిన కొందరు అభ్యర్థులు..**

మేడ్చల్ నియోజకవర్గం నుంచి బరిలో ఉన్న శ్రమజీవి పార్టీ అభ్యర్థి బి.దుర్గాప్రసాద్‌యాదవ్, భరోసా పార్టీ అభ్యర్థి సి.ఏసయ్య, స్వతంత్ర అభ్యర్థులు కంది వెంకటాచారి, ఎస్.అనిల్‌కుమార్‌లు మేడ్చల్ కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేశ్ యాదవ్‌కు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు తెలిపి కాంగ్రెస్ పార్టీలో చేరటం జరిగిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ గాలీ వీస్తుందని, ప్రజలు అంత మార్పును కోరుకుంటున్నారని మేడ్చల్‌లోనూ కాంగ్రెస్ విజయం సాధిస్తుందని వారు అన్నారు.



దమ్మాయిగూడలో కాంగ్రెస్ ప్రచారంలో భాగంగ పాల్గొని మాట్లాడుతున్న కేరళ మాజీ హోంమంత్రి రమేశ్ చెన్నితాల,పాల్గొన్న మేడ్చల్ కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేశ్‌యాదవ్,పాల్గొన్న నాయకులు

## కార్తీక పౌర్ణమి సందర్భంగా శ్రీసత్యనారాయణస్వామి వ్రతాలు



అలియాబాద్‌లోని శ్రీరమాసత్యనారాయణస్వామి ఆలయంలో జరిగిన సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించిన పాల్గొన్న దంపతులు, మండల జడ్పీటిసి ఎం.అనితలాలయ్య, భక్తుల దృశ్యం

**శామీర్‌పేట, నవంబరు 27, ప్రభాతవార్త**

కార్తీక ఫౌర్ణమిని పురస్కరించుకుని అలియాబాద్ సమీపంలోని శ్రీరమాసత్యనారాయణ స్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. భారీ సంఖ్యలో భక్తులు పాల్గొని శ్రీస్వామి వారిని దర్శించుకున్నారు. శామీర్‌పేట మండలంలోని అలియాబాద్ సమీపంలోని శ్రీరమా సత్యనారాయణస్వామి ఆలయంలో పలువురు దంపతులు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. దీనిలో శామీర్‌పేట మండల జడ్పీటిసి సభ్యురాలు ఎం.అనితలాలయ్య పాల్గొని శ్రీస్వామి వారిని దర్శించుకుని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు టి.జగదీశ్వర్‌గౌడ్ కూడ పాల్గొన్నారు. అదే విధంగ శామీర్‌పేటలోని శివాలయంలోనూ సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు జరిగాయి. తూంకుంటలోని శ్రీగాయిత్రీ మాత మహాక్షేత్రంలోనూ కార్తీకఫౌర్ణమి సందర్భంగ ప్రత్యేక పూజలు జరిగాయి. పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## నాచగిరి క్షేత్రంలో కార్తీకమాస సందడి

**వర్గల్, నవంబర్ 27(ప్రభాతవార్త):**

మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన రెండవ యాదాద్రిగా విరాజిల్లు తున్న నాచగిరి లక్ష్మీనృసింహ్మాస్వామి దేవాల యంలో కార్తీకమాస సందడి నెలకొంది. సోమవారం కార్తీక పౌర్ణమిని పుర స్కరించుకొని భక్తులు నాచగిరి క్షేత్రానికి వచ్చి కార్తీకమాస పుణ్య స్నానాలు అచరించి సుమారు 7వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి అన్న పూర్ణ తెలిపారు. అలాగే కార్తీక పౌర్ణమి సందర్భంగా స్వామివారి సన్నిధిలో 220 మంది జంటలు శ్రీ సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరించినట్లు తెలిపారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యంకలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు.

### మల్లికార్జున ఖర్గే సభకు తరలి వెళ్లిన కాంగ్రెస్ శ్రేణులు

**వెల్దుర్తి, నవంబర్ 27 ప్రభాతవార్త:** శివ్వంపేట మండలం గొట్టిముక్కుల గ్రామ శివారులో సోమవారం జరిగిన ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే సభకు మండల పరిధిలోని వివిధ గ్రామాల నుండి కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుధాకర్‌గౌడ్, నరేందర్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ కిష్టాగౌడ్, వెంకట్‌రెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## వివాహానికి రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్టు సాయం

**కడ్తాల్,నవంబరు 27 ప్రభాతవార్త :**

మండల పరిదిలోని నిరుపేదల కుటుంబీకురాలు బోల బాలమణి కుమార్తె అనుష వివాహానికి జర్పుల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్టు ద్వారా పదివేల రూపాయల ఆర్థిక సహాయాన్ని జడ్పీటిసి జర్పుల దశరథ్‌నాయక్ స్థానిక నాయకులతో కలిసి బాలమణికి అందించారు. అలాగే కడ్తాల్ మండల కేంద్రానికి చెందిన నార్లకంటి మల్లేష్ గతకొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడతున్నారు. సోమవారం మల్లేష్ ఇంటికి వెళ్లిన జడ్పీటిసి దశరథ్ నాయక్ మల్లేష్‌కు రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్టు ద్వారా రూ. 5వేల ఆర్థిక సాయం అందించారు. అదేవిధంగా వైస్ ఎంపిపి ఆనంద్ రూ 5 వేలు, సర్పంచ్ లక్ష్మి నరసింహారెడ్డి రూ. 5 వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో జిల్లా రైతుసమితి సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, పిఎసిఎస్ ఛైర్మన్ గంప వెంకటేష్ గుప్తా, వైస్ ఎంపిపి బావండ్లపల్లి ఆనంద్, సర్పంచ్ గూడూరు లక్ష్మి నరసింహారెడ్డి, ఉపసర్పంచ్ రామకృష్ణ, డైరెక్టర్ లాయక్ అలీ, నాయకులు లక్ష్మణాచారి, వెంకటేష్, శ్రీను, చంద్రయ్య, రాజు, వెంకటయ్య, రమేష్ పాల్గొన్నారు.

## మరొక్కసారి ఆశీర్వదించి గెలిపించండి

**రామాయంపేట ఎన్నికల ప్రచారంలో మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి**

**రామాయంపేట మున్సిపాలిటీ, నవంబర్ 27, ప్రభాతవార్త :**

సిఎం కేసీఆర్ 10 ఏళ్ల పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ది చెం దిందని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం రామాయంపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని అన్ని వీధులలో తిరుగుతూ కారు గుర్తుకు ఓటేసి తనను మరొక్కసారి ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఎస్‌సి కాలనీలో ప్రారంభమైన ర్యాలీ పట్టణంలోని పురవీధులగుండా వివేకానంద సర్కిల్ చేరుకుంది. అక్కడ మహిళలతో కలిసి పద్మాదేవేందర్‌రెడ్డి బతుకమ్మ ఆట ఆడారు. అక్కడినుండి మెదక్ చౌరస్తా వరకు చేరుకొని అక్కడ ప్రచారం రథం నుండి ఆమె మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ కారు గుర్తుకు ఓటు వేసి మళ్లీ ఒకసారి మీ ఇంటి ఆడబిడ్డను ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో కంఠారెడ్డి తిరుపతి రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ పల్లె జితేందర్ గౌడ్, వైస్ ఛైర్మన్ పుట్టి విజయ లక్ష్మి యాదగిరి, పాల్గొన్నారు.


**PUBLIC NOTICE**

The General Public are hereby notified that my client is intending to purchase to purchase the under mentioned property From **Shri. Arvind Vannala**, son, of **Sriramulu Vannala,** resident of # C-1, Manjeera Residency, Journalist Colony, Jubilee Hills, Hyderabad-500033, Telangana State, India, and has paid advance sale consideration:

**SCHEDULE OF PROPERTY**

All that the open land bearing: **Land Full Address, Area in Acres/ Square Yards :** SY # 390,393/A2, admeasuring **Ac 2.00 Gts.** Situated at Bhattupalli Road, Ursu Village, Warangal. SY # 357/3, admeasuring **Ac.1.23 Gts.** Situated at Bhattupalli Road, Warangal. SY #99E, Plot No.14, admeasuring **563 Sq. Yards.** Situated at Prakashreddy pet, Hanamkonda. SY #.935 admeasuring **1922 Sq. Yards.** Situated at padmakshi Road, Hanamkonda. SY #952/3, admeasuring **834 Sq. Yards.** Situated at padmakshi road, Hanamkonda. SY #13,14,89,90 admeasuring **Ac. 43.06 Gts.** Situated at Kothamolgara, Pathamolgara, Buthpur Mandal Mahabubnagar Dist. SY.NO.61,62,64 admeasuring **Ac 18.38 Gts,** Situated at Patha Molgara, Buthpur Mandal, Mahabubnagar. SY.NO.531,532 admeasuring **Ac 11.23 Gts,** Situated at CHATANPALLY VILLAGE, SHADNAGAR MANDAL, RANGAREDDY DIST. SY.NO. 531, 532 admeasuring **Ac 2.21 Gts,** Situated at CHATANPALLY VILLAGE, SHADNAGAR MANDAL RANGAREDDY DIST.

Any person/persons having any objection for the sale transaction may contact the undersigned with relevant documents within one week from today. Any objection made thereafter will not binding my clients.

**Sd/- Dasari Prem Sagar**
**Advocate**
Road No 4, Advocates Colony, Hanumakonda.
**Cell : 9849261500**


# చేవెళ్ల గడ్డపై బిజెపి జెండా ఎగురవేస్తాం



మండలంలోని నాగిరెడ్డి గూడలో గడప గడపకు ఎన్నికల ప్రచారంలో భాగంగా పలువురు బిజెపిలో చేరిక

**మొయినాబాద్, నవంబర్ 27 ప్రభాతవార్త:**

చేవెళ్ల గడ్డపై బిజెపి జజెండా ఎగుర వేస్తామని చేవెళ్ల నియోజకవర్గం బిజెపి అభ్యర్థి కెఎస్ రత్నం అన్నారు. మండలంలోని నాగిరెడ్డి గూడలో గడప గడపకు ఎన్నికల ప్రచారంలో భాగంగా పలువురు సోమవారం బిజెపి అభ్యర్థి కెఎస్ రత్నం, మండల పార్టీ అధ్యక్షుడు మధుసూధన్‌రెడ్డిల సమక్షంలో బిజెపి పార్టీలో చేరారు. వారందరికి కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం రత్నం మాట్లాడుతూ పదేళ్ల టిఆర్ఎస్ పాలన చూసిన ప్రజలు నరేంద్రమోడీ పాలనకు జై కొడుతున్నారని అన్నారు. కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూపి ప్రజలు ఈసారి చేవెళ్ల నియోజకవర్గంలో బిజెపికి ఓట్లేసేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. కమలం గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీని అందించాలని అభ్యర్థి రత్నం ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. నాగిరెడ్డి గూడలో బిజెపిలో చేరిన వారిలో కొడచర్ల నరసింహ, కొడిచర్ల శ్రీకాంత్, ముంజగల రఘుపతి, బంటు ఈశ్వర్, జీన్‌కుంట సందీప్, తదితరులు ఉన్నారు.

## బిజెపి నాయకుల ఇంటింటా ప్రచారం



ఇంటింట ఎన్నికల ప్రచారంలో బిజెపి నాయకులు

**శంకర్‌పల్లి, నవంబర్ 27 ప్రభాతవార్త:**

శంకర్‌పల్లి మండల పరిధిలోని మిర్జాగూడ, ఇంద్రారెడ్డి నగర్‌లో బిజెపి నాయకులు సోమవారం ఇంటింట ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పంతం సంజీవ, మండల ప్రధాన కార్యదర్శి రాజేందర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్‌ను ఓడించేందుకు ప్రజలు ఏకమవ్వాలి

### -డీసీసీబి చైర్మెన్ బుయ్యని మనోహర్‌రెడ్డి

**పెద్దేముల్, నవంబరు 27, ప్రభాతవార్త:** అబద్దాలతో మోసగించడంలో ప్రధాని మోడి, సిఎం కేసిఆర్ ఒక్కటేనని,బిఆర్ఎస్‌ను ఓడించేందుకు ప్రజలు ఏకమవ్వాలని డీసీసీబి చైర్మెన్, తాండూరు కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి బుయ్యని మనోహర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని గాజీపూర్, పెద్దేముల్, పెద్దేముల్ తాండాలో కాంగ్రెస్ నిర్వహించిన ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ హామీల అమలులో బిఆర్ఎస్ ఘోరంగా విఫలమైందని, ప్రస్తుత ఎన్నికలలో సిఎం కేసిఆర్ గద్దె దిగడం ఖాయమని జోస్యం చెప్పారు. రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం రాబోతుందని, పేదలకు కష్టాలు ఉండవని భరోసా కల్పించారు. తమ మెనిపెస్టోలో పేర్కొన్న ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో పీసీసీ రాష్ట్ర ఉపాధ్యాక్షులు యం.రమేష్ మహరాజ్, ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, మాజీ జడ్పిటిసి రాకేష్ మహరాజ్,జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు శోభారాణి, ఉపాధ్యాక్షులు ఎల్లారెడ్డి, టీపీసీసీ మైనార్టీ కన్వీనర్ యండి రియాజ్, మండల పార్టీ అధ్యక్షుడు కొండపురం గోపాల్, వర్కింగ్ ప్రెసిడెంట్ పెండ్యాల ప్రవీన్ కుమార్ గుప్తా, సోసైటి డైరెక్టర్ ఎస్.నారాయన్‌రెడ్డి, సీనియర్ నాయకులు కొమ్ము గోపాల్‌రెడ్డి, జితెందర్‌రెడ్డి, బీసీ సెల్ అధ్యక్షులు బుద్దారం వెంకటయ్య పాల్గొన్నారు.

## ఆనంద్ గెలుపుతోనే వికారాబాద్ అభివృద్ధి

### -మెతుకు ఆనంద్ సతీమణి డాక్టర్ సబిత



మేకవనంపల్లి గ్రామంలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న వికారాబాద్ ఎమ్మెల్యే మెతుకు అనంద్ సతీమణి డాక్టర్ సబిత,

**కోట్‌పల్లి,నవంబరు 27,ప్రభాతవార్త;**

వికారాబాద్ నియోజక వర్గంలో అనంద్ గెలుపుతోనే వికారాబాద్ అభివృద్ది సాధ్యంమని వికారాబాద్ ఎమ్మెల్యే మెతుకు అనంద్ సతీమణీ డాక్టర్ సబిత అన్నారు. సోమవారం మోమిన్‌పేట్ మండల పరిధిలోని మేకవనంపల్లి, మేకవనంపల్లితండా, గ్రామంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా అమె పర్యాటించి ఇంటింటికి వెళ్ళి బీఆర్ఎస్ పార్టీ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు.ఈసందర్బంగా అమె మాట్లాడుతూ. వికారాబాద్ అన్ని రంగాల్లో అభివృద్ది చేయడం జరుగుతుందన్నారు. అదా మరిచి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే మళ్ళీ పాత రోజులు వస్తాయన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు.ఈ ఎన్నికల్లో మొదటగా ఉన్న గుర్తు కారు గుర్తుకు ఓటు వేసి అనంద్‌ను భారీ మోజార్టీతో గెలిపించాలని అమె పేర్కొన్నారు,

## కాంగ్రెస్ హయాంలోనే మైనార్టీల అభివృద్ధి

### -కాంగ్రెస్ మైనార్టీ సెల్ జాతీయ అధ్యక్షులు ఇమ్రాన్ ప్రతాప్ గరి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి హైదారాబాద్, నవంబర్ 27(ప్రభాతవార్త):** మైనార్టీల అభివృద్ధి కాంగ్రెస్ హయాంలోనే జరిగిందని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జాతీయ అధ్యక్షులు ఇమ్రాన్ ప్రతాప్ గరి అన్నారు. సోమవారం మహేశ్వరం కాంగ్రెస్ అభ్యర్థి కేఎల్ఆర్‌కు మద్దతుగా షాహిన్ నగర్ మార్కజ్ వద్ద ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ... తెలంగాణ ముఖ్యమంత్రి కేసిఆర్ ముస్లింలకు మోసం చేశారని తెలిపారు. బిఆర్ఎస్ అధికారంలో వచ్చిన తర్వాత మజీద్‌లను కూల్చి వేశారని, వకఫ్ ఆస్తులు కబ్జాకు గురవుతున్నాయన్నారు. మళ్లి ముస్లింలకు పూర్వ వైభవం రావాలంటే కాంగ్రెస్‌ను గెలిపించాలన్నారు. తెలంగాణలో కూడా ముస్లింలు కర్ణాటక తరహా తీర్పు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ అభ్యర్థి కేఎల్ఆర్, నాయకులు, తయాబ్ దహన్ని,యూసుప్ ఖాద్రి, అఫ్జల్, భారి సాధక్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జాతీయ అధ్యక్షులు ఇమ్రాన్ ప్రతాప్ గరి.

## శివాలయాల్లో భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి పూజలు



అంకుశాపూర్‌లోని శ్రీ స్ఫటిక లింగేశ్వరాయలంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా దీపాలు వెలిగించిన మహిళలు

**ఘట్‌కేసర్ రూరల్, నవంబర్ 27, ప్రభాతవార్త:** కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో సోమవారం శివాలయాలను సందర్శించి పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో కార్తికదీపోత్సవాలు వెలిగించి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. ఘట్‌కేసర్ మండలంలోని పోచారం శ్రీ స్ఫటిక లింగేశ్వరాలయం, అంకుశాపూర్‌లోని శ్రీ స్ఫటిక లింగేశ్వరాలయం, అవుశాపూర్‌లోని శివాలయం, ప్రతాప సింగారం, కొర్రెముల, కాచవాని సింగారం తదితర గ్రామాల్లో భక్తులు శివాలయాలను సందర్శించి పూజలు చేశారు. ఆలయ ఆవరణలో దీపాలు వెలిగించి పూజలు చేశారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆయా గ్రామాల్లోని శివాలయాలు భక్తుల సందర్శనతో రద్దీగా కనిపించాయి.

## అభివృద్ధి చేయని బీఆర్ఎస్ పార్టీ మనకొద్దు : అనన్య చేతన్



దుర్గంచెర్వు గ్రామంలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కూతురు అనన్యచేతన్,

**కోట్‌పల్లి,నవంబరు 27, ప్రభాతవార్త;** వికారాబాద్ నియోజక వర్గంలో బీఆర్ఎస్ పార్టీ ఎలాంటి అభివృద్ధి చేయలేదని అలాంటి బీఆర్ఎస్ పార్టీకి మనకోద్దు అని అభివృద్ధి పనులు చేసే కాంగ్రెస్ పార్టీకే ఓటు వేసి గెలిపించాలని మాజీ మంత్రి ప్రసాద్ కుమార్ కూతురు అనన్య చేతన్ అన్నారు.సోమవారం నాడు మోమిన్‌పేట్ మండల పరిధిలోని దుర్గంచెర్వు గ్రామంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటికి వెళ్ళి కాంగ్రెస్ పార్టీ ప్రవేశపట్టిన ఆరు గ్యారెంటీ పథకాలపై ప్రజలకు వివరించారు. ఈసందర్బంగా అమె మాట్లాడుతూ.వికారాబాద్ నియోజక వర్గంలో బీఆర్ఎస్ పార్టీని ప్రజలు నమ్మె పరిస్థితి లేదన్నారు.ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి ప్రసాద్‌కుమార్ భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈకార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గోన్నారు,

### కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయం: శ్రీనివాస్ ముదిరాజ్

తెలంగాణ రాష్ట్రంలో వికారాబాద్ నియోజక వర్గంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని బీసీసెల్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్‌ముదిరాజ్, అన్నారు. సోమవారం నాడు కోట్‌పల్లి మండల పరిధిలోని ఎన్నారం గ్రామంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటికి వెళ్ళి కాంగ్రెస్ పార్టీ ప్రవేశ పెట్టిన ఆరు గ్యారెంటీలపై ప్రజలకు వివరించారు. ఈకార్యక్రమంలో నాయకులు వెంకట్‌రాంరెడ్డి, పార్టీ కార్యకర్తలు పాల్గోన్నారు.

## జలాల్‌పూర్ యువత కాంగ్రెస్‌కే మద్దతు



**బషీరాబాద్ నవంబరు27,ప్రభాతవార్త :** జలాల్‌పూర్ యువత మొత్తం కాంగ్రెస్ పార్టీకే మద్దతు ఇస్తుందని గ్రామ యువకులు అన్నారు.బషీరాబాద్ మండలం జలాల్ పూర్ గ్రామానికి చెందిన ఓటర్లు హైదరాబాద్‌లో ఉంటున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా అక్కడికి వెళ్లి గ్రామస్థులతో సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా నాగేష్ ఆధ్వర్యంలో గ్రామ యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...బీఆర్ఎస్ ప్రభుత్వంలో తమ గ్రామం ఎలాంటి అభివృద్ధి నోచుకోలేదని అన్నారు.కాంగ్రెస్ పార్టీకి ఓటేసి మనోహర్ రెడ్డిని గెలిపించుకొని గ్రామాన్ని అభివృద్ధి చేసుకుంటామని అన్నారు.ఈ కార్యక్రమంలో రామ్‌ప్రసాద్,రవీ,జైరామ్,శాతీష్,శ్రీను,బాలయ్య,తదితరులు ఉన్నారు.

## బీఆర్ఎస్ అభ్యర్థికి తగిన గుణపాఠం చెప్పాలి



బొట్టుపెట్టి ఓటు అడుగుతున్న బీజేపీ అభ్యర్థి కె.ఎస్ రత్నం సతీమణి ప్రమీల

**షాబాద్, నవంబర్ 27, ప్రభాతవార్త :** కుటుంబ పాలన సాగిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థికి తగిన గుణపాఠం చెప్పే సమయం అసన్నమైందని బీజేపీ అభ్యర్థి కె.ఎస్ రత్నం సతీమణి ప్రమీల అన్నారు. సోమవారం షాబాద్ మండల కేంద్రంలో ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ....చేవెళ్ల నియోజకవర్గ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమన్నారు. చేవెళ్ల సమస్యలపై అవగాహన కలిగిన వ్యక్తి రత్నంను గెలిపించుకుంటే వెంటనే సమస్యలు పరిష్కారించుకోవచ్చునని తెలిపారు.కబ్జాదారులు, క్రిమినర్లను ఈ ఎన్నికల్లో ఓడించి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందామన్నారు. కమలం పువ్వుకు ఓటు వేసి దేశాభివృద్ధిలో పాటు పంచుకుందామన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి, బీజేవైఎం స్వచ్ఛ భారత్ సెల్ రాష్ట్ర కన్వీనర్ రాము, మండల అధ్యక్షులు కిరణ్, ప్రధాన కార్యదర్శి సురేష్, బీజేవైఎం మండల అధ్యక్షులు మహేష్, నాయకులు రవీందర్‌రెడ్డి, మాణెయ్య, మహేందర్, గోపాల్, మహేష్, క్యామ నారాయణ, విజయ్, సాయి, ఆయా గ్రామాల శక్తి కేంద్రాల ఇంచార్జీలు, బూత్ కమిటీల సభ్యులు ఉన్నారు.

# తాండూరులో గెలుపు దిశగా కాంగ్రెస్

**-అధికార పార్టీ నేతల్లో వణుకుపుట్టిస్తున్న బుయ్యని**
**- బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి పెద్ద ఎత్తున వలసలు**



ఇంటింటికి తిరిగి ప్రచారం చేస్తున్న మనోహార్‌రెడ్డి.

**తాండూరు, నవంబరు 27, ప్రభాతవార్త :** తాండూరు నియోజకవర్గంలో గెలుపు దిశగా కాంగ్రెస్ అభ్యర్థి బుయ్యని మనోహార్‌రెడ్డి దూసుకుపోతున్నారు. ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. నియోజకవర్గంలోని వివిద మండలాలలో కాంగ్రెస్ అభ్యర్థి మనోహార్‌రెడ్డి విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇంటింటికి తిరిగి ప్రచారం చేస్తున్నారు. గత నాలుగున్నరేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన అన్యాయాన్ని ప్రజలకు వివరిస్తున్నారు. అధికార పార్టీ గుండెల్లో వణుకుపుట్టిస్తున్నారు. ఎలాగైనా తాండూరులో పట్టు నిలుపుకోవడమే లక్ష్యంగా ప్రచారంలో దూసుకుపోతున్నారు. గ్రామాల్లోని యువతకు ఆకర్శనగా నిలుస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి నియోజకవర్గానికి చేసింది ఏమి లేదంటూ, తాండూరు ప్రాంత యువతను చెడు వ్యసనాలకు బానిసలను చేస్తూ.. అరాచక పాలన కొనసాగిస్తున్నారని.. తాండూరు ప్రాంత ప్రజలకు తీరని అన్యాయం చేస్తున్న పైలెట్ రోహిత్‌రెడ్డిని తరిమికొడదామని ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త కంకణం కట్టుకొని పార్టీ కోసం పనిచేయాలని, కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో 6గ్యారెంటీ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పిలుపునిస్తున్నారు. బీఆర్ఎస్ హయాంలో అవినీతి కుంబకోణంలో మునిగిపోయిందని, పార్టీ నాయకులకే సంక్షేమ పథకాలు అందించారని ఆరోపించారు. కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ ప్రకటించిన ఆరు గ్యారెంటీ పథకాలు నిరుపేదలకు ఎంతో మేలు జరుగనుందని తెలిపారు. తాండూరులో బీఆర్ఎస్ అభ్యర్థి రోహిత్‌రెడ్డి అరాచక పాలనను ప్రజలే అంతమొందించాలని.. బీఆర్ఎస్‌కు గుణపాఠం చెప్పాలని, ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతామని తెలిపారు.

# అధికారంలోకి వస్తాం..ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేస్తాం

**-మాజీ మంత్రి గడం ప్రసాద్‌కుమార్**



సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాద్‌కుమార్

**మర్పల్లి నవంబర్ 27 ప్రభాతవార్త :** మర్పల్లి మండలంలోని పంచలింగాల్ మర్పల్లి మండలకేంద్రలో సోమవారం ప్రసాద్‌కుమార్ ఎన్నిక ప్రచారం నిర్వహించారు పంచలింగాల్ ప్రచారం అనంత్రం పంచలింగాల్ నుండి మర్పల్లి వరకు మారి బైక్ రాలి నిర్వహించారు అనంత్రం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం జరుగుతుందని అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామన్నారు అవినీతి,అబద్దాల,కల్వ కుంట్ల కుటుంబాన్ని సాగనంపాలని కాంగ్రేస్‌కు ఓటువేసి తెలంగాణ ఇచ్చిన సోనియ గాంధిని ఆశీర్వదించాలని ఆయన కోరారు.కాంగ్రేస్ హాయంలో రైతులకు వ్యవసాయ పరికరాలు సబ్సిడిపై ఇచేదని వాటిని రద్దు చేసి రైతుబందు ఇస్తున్నారని అన్నారుఈసమావేశంలో బ్లాక్ కాంగ్రేస్ అద్యక్షులు కృష్ణరెడ్డి గ్రందాలయ మాజీ చైర్మెన్ కొండల్‌రెడ్డి,మార్కెట్‌మాజి ఉపాద్యక్షులు రామేశ్వర్,మార్కెట్ మాజి చైర్మెన్ పి.సాయన్నముదిరాజ్, మండలమాజి ఎంపీపీ నర్సింలు,పలువురు నాయకులు ప్రసంగించారు సమావేశంలో పార్టీ లద్యక్షులు రవెందర్, నాయకులు శంకరయ్యగౌడ్, కలీమొదీనసుబాస్ యాదవ్, స్వప్న సురేష్, సంజీవరెడ్డి సలీం,పస్సి,అశోక్‌ముదిరాజ్,నాగేస్,పలు గ్రామాల నాయకులు సర్పంచ్‌లు ఎంపిటీసి సభ్యులు కార్యకర్తలకు పాల్గోన్నారు

# మాజీ ఎంపి కొండ విశ్వేశ్వరరెడ్డి రోడ్ షో



మొయినాబాద్ మండలంలోని బాకారంలో మాజీ ఎంపి, బిజెపి నేత కొండ విశ్వేశ్వర రెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్వహించిన రోడ్ షో

**మొయినాబాద్, నవంబర్ 27 ప్రభాతవార్త:** మరికొద్ది గంటల్లో ఎన్నికల ప్రచారానికి తెరపడనుండడంతో చేవెళ్ల నియోజకవర్గంలో బిజెపి ఎన్నికల ప్రచారం జోరుగా జరుగుతోంది. బిజెపి అభ్యర్థి కెఎస్ రత్నం గెలుపు కోరుతూ మాజీ ఎంపి కొండ విశ్వేశ్వర రెడ్డితో పాటు నియోజకవర్గం నేతలు ప్రచారంలో బిజి బిజీగా ఉన్నారు. మొయినాబాద్ మండలంలోని బాకారంలో మాజీ ఎంపి కొండ విశ్వేశ్వర రెడ్డి సోమవారం రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపికి రోజు రోజుకీ ప్రజల నుంచి మద్దతు పెరుగుతోందని అన్నారు. రాష్ట్రంలో కెసిఆర్ కుటుంబ పాలన, చేవెళ్ల నియోజకవర్గంలో కాలె యాదయ్య కుటుంబ పాలనకు ప్రజలు చరమ గీతం పాడడానికి సిద్దంగా ఉన్నారని, ప్రజలే బిఆర్ఎస్ పార్టీకి బుద్ధి చెబుతారని అన్నారు. కమిషన్ల కోసం కాళేశ్వరం ప్రాజెక్టును వాడుకున్న కెసిఆర్ కుటుంబం త్వరలోనే అంతకంత అనుభవిస్తుందని, ప్రజలే వారికి తగిన శాస్తి చేస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మధుసూధన్‌రెడ్డి, మండల నాయకులు గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# కౌంటింగ్ కేంద్రాన్ని సందర్శించిన జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ గౌతమ్

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి నవంబరు 27, ప్రభాతవార్త :** మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా ఎన్నికల కౌంటింగ్ కేంద్రాన్ని మేడ్చల్ జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ గౌతమ్ సందర్శించారు. ఎన్నికల కౌంటింగ్ కోసం చేపట్టిన ఏర్పాట్లను ఆయన సందర్శించి పరిశీలించారు. సోమ వారం మేడ్చల్ జిల్లా కీసర మండలంలోని బోగారంలో ఉన్న హోలీమేరి ఇంజనీరింగ్ కాలేజీలో ఎన్నికలకు సంబంధించి కౌంటింగ్ కేంద్రాలను జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డిఆర్ఓ హరిప్రియ తో కలిసి అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు కొరకు చేపడుతున్న ఏర్పాట్లను ఆయన సందర్శించి పరిశీలించారు. ఐదు నియోజకవర్గాలకు సంబంధించి కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినందున గదులను స్వయంత సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగ కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ కౌంటింగ్‌కు హాజరయ్యే సిబ్బంది, కౌంటింగ్ ఏజెంట్లకు వేరువేరు మార్గాలను ఏర్పాటు చేయాలన్నారు. కౌంటింగ్ నిర్వాహణకు సంబంధించి అవసరమైన బారికేడ్లను ఏర్పాటు చేయాలని అన్నారు. కౌంటింగ్ భవనం ఆవరణలో గ్రౌండ్ లేవల్ చేయాలని, నియోజవర్గాల వారీగ కౌంటింగ్ ఏజెంట్లు వచ్చేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, ప్రతి ఒక్కరికి నిర్దేశించిన మార్గాలనూ సూచిస్తూ అవసరమైన చోట్ల సూచికల బ్యానర్లు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు. కౌంటింగ్ నిర్వాహణ సమయంలో ఎన్నికల పరిశీలకుల కోసం ప్రత్యేక గదులు ఏర్పాటు చేయాలని, అందులో సిసి కెమెరాలు, వేగవంతమైన నెల్‌సౌకర్యం, కంప్యూటర్లు, సిటింగ్ ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లో ఐదు నియోజకవర్గాలకు సంబంధించిన కౌంటింగ్ హాల్స్‌ను, స్ట్రాంగ్ రూమ్‌లను కలెక్టర్ పరిశీలించి చేయాల్సిన ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. స్ట్రాంగ్ రూమ్‌లో కారిడా ర్‌లో జరిగే విషయాలు కూడ రికార్డ్ చేసే విధంగ సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు.



మేడ్చల్ జిల్లా కీసర మండలం బోగారంలోని జిల్లా కౌంటింగ్ కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ గౌతమ్,పాల్గొన్న అధికారులు

కౌంటింగ్ కేంద్రాల్లో పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు కోసం తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లో ఏజెంట్ల కోసం, సిబ్బంది కోసం అన్ని ఏర్పాట్లు, సౌకర్యాలు, త్రాగునీరు, బోజనం సౌకర్యం కల్పించాలన్నారు. మీడియా సెంటర్ ఏర్పాటు చేయాలని, ప్రతి రౌండ్ కౌంటింగ్ వివరాలను సకాలంలో మీడియాకు చేరే విధంగ చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయంలో ఏ మాత్రం నిర్లక్ష్యం చేయకుండ చూడాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకరావాలని కలెక్టర్ అన్నారు. వారితో పాటు కలెక్టర్ వెంట ఆర్ఓలు, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మైసిగండిలో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు

**-మొదటిరోజు పోటెత్తిన భక్తజన సందోహం**



మైసిగండి అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న పురోహితులు

**కడ్తాల్,నవంబరు 27 ప్రభాతవార్త :** కడ్తాల్ మండలం మైసిగండి మైసమ్మ ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలకు ఆలయం ముస్తాబైంది. ప్రతి ఏటా కార్తీక పౌర్ణమి నుంచి ఉత్సవాలు ప్రారంభమవుతాయి. సోమవారంతో ప్రారంభమైన ఉత్సవాలు డిసెంబర్ 02 వరకు భక్తి శ్రద్ధలతో కొనసాగనున్నాయి. అమ్మవారి ఉత్సవాలను తిలకించేందుకు వచ్చే భక్తులకు సౌకర్యార్థం నిర్వాహకులు ఆలయం వద్ద భారీ ఏర్పాట్లు చేశారు. భక్తులకు దర్శనం కోసం ఆలయ ఈఓ స్నేహలత, ఆలయ ట్రస్టీ చైర్మన్ శిరోలి పంతునాయక్ ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారికి క్షీరాభిషేకం, విశేష అలంకరణ, కుంభహారతి, కార్తీక దీపోత్సవంలో భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని ఆలయ ఆవరణలో భక్తులు దీపారాధన, సామూహిక వ్రతాలు లాంటి కార్యక్రమాలు చేపట్టారు. కార్తీక దినోత్సవాన్ని పురస్కరించుకుని అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు గావించారు. ప్రత్యేక పూజలు గావించిన ప్రజా ప్రతినిధులు, అధికారులను ఆలయ ఈఓ స్నేహలత, ఆలయ ట్రస్ట్ ఛైర్మన్ శిరోలి పంతునాయక్ పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టిపిసిసి సభ్యులు అయిళ్ళ శ్రీనివాస్‌గౌడ్, నాయకులు ఆర్పి. భాస్కర్ దంపతులు, రాహుల్, మాదారం శ్రీరాములుగౌడ్, ఆలయ అర్చకులు బిచ్యానాయక్, అమృనాయక్, మాదారం యాదగిరి, ఎర్రోళ్ల రఘవేందర్, ఆలయ అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ప్రజాప్రతినిధులు, అధికారులను సన్మానించిన దృశ్యం

## మండల కేంద్రంలో పోలీసుల కవాతు



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

**కడ్తాల్,నవంబరు 27 ప్రభాతవార్త :** అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సోమవారం కడ్తాల్ మండల కేంద్రంలో స్థానిక ఎస్‌హెచ్ఓ శివప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసుల కవాతు నిర్వహించారు. కవాతులో పోలీసు అధికారులు, సిబ్బంది ఆర్మీ బలగాలు పాల్గొన్నాయి. జాతీయ రహదారితో పాటు, ప్రధాన కాలనీల మీదుగా కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్ఓ శివప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలతో అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా పోలీసు బలగాలతో కవాతు నిర్వహించడం జరిగిందన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదన్నారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై హరిశంకర్‌గౌడ్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## కాంగ్రెస్ పార్టీ మండల బీసీ సెల్ ప్రధాన కార్యదర్శిగా ఆనందచారి



ఆనందచారీని అభినందిస్తున్న మనోహార్‌రెడ్డి

**పెద్దేముల్, నవంబరు 27, ప్రభాతవార్త:** పెద్దేముల్ మండల కాంగ్రెస్‌పార్టీ మండల బీసీ సెల్ ప్రధాన కార్యదర్శిగా పెద్దేముల్ గ్రామానికి చెందిన ఆనందచారీని నియమించినట్లు మండల బీసీ సెల్ అధ్యక్షుడు బుద్దారం వెంకటయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు డీసీసిబి చైర్మెన్, తాండూరు కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి బుయ్యని మనోహార్‌రెడ్డి ఆనందచారీకి నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆనందచారీ మాట్లాడుతూ తనపై నమ్మకంతో మండల ప్రదానకార్యదర్శి పదవి కట్టబెట్టినందుకు పీసీసీ ప్రదానకార్యదర్శి ధారాసింగ్, జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు శోభారాణి, జిల్లా ఉపాధ్యాక్షులు ఎల్లారెడ్డి, తాండూరు ఏ బ్లాక్ అధ్యక్షులు లొంక నర్సిములు, మండల అధ్యక్షులు గోపాల్, వర్కింగ్ ప్రెసిడెంట్ పెండ్యాల ప్రవీన్‌కుమార్ గుప్తా, బీసీ సెల్ అధ్యక్షులు వెంకటయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్‌పార్టీ బలోపేతానికి తన శక్తివంచన లేకుండా కృషిచేసి ఎమ్మెల్యేగా మనోహార్‌రెడ్డిని గెలిపించుకుంటామని అన్నారు.

## బీఆర్ఎస్‌లో చేరిన మైనార్టీ నాయకులు



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న వడ్ల నందు

**ధారూర్ నవంబరు27,ప్రభాతవార్త :** ధారూర్ మండల పరిధిలోని దోర్నాల గ్రామానికి చెందిన మైనార్టీ నాయకులు పెద్ద ఎత్తున మండల పార్టీ అధ్యక్షుడు రాజు నాయక్,సీనియర్ నాయకులు వేణు గోపాల్ రెడ్డి,వడ్ల నందు ఆధ్వర్యంలో సోమవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి గులాభీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ఎమ్మెల్యే అభ్యర్థి ఆనంద్ గెలుపు కోసం కృషి చేస్తామని అన్నారు. ఈకార్యక్రమంలో వెంకట్ రామ్ రెడ్డి,లాలయ్య,తదితరులు పాల్గొన్నారు.

## సుస్థిర పాలన అందించడం కాంగ్రెస్‌కే సాధ్యం



మంబాపూర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**పెద్దేముల్, నవంబరు 27, ప్రభాతవార్త:** బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషిచేసింది కాంగ్రెస్సేనని, సుస్థిర పాలన అందించడం కాంగ్రెస్‌కే సాధ్యమని మంబాపూర్ మత్స్యకార సంఘం అధ్యక్షులు, మాజీ వార్డు మెంబర్ తెర్వటి నర్సిములు, నాయి బ్రాహ్మణ సంఘం ప్రతినిధి మంగలి పాండు అన్నారు. సోమవారం పెద్దేముల్ మండలం మంబాపూర్ గ్రామంలో కాంగ్రెస్ ఇంటింటి ప్రచారంలో వారు పాల్గొని మాట్లాడుతూ రుణమాఫి, పించన్లు, డబుల్ బెడ్ రూంఇండ్లు, దళిత బందు, బీసీ బందు తదితర విషయాలలో బిఆర్ఎస్ ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. బిఆర్ఎస్ పట్ల ప్రజలు విసిగిపోయారని, మార్పు కోరుకుంటున్నారని అన్నారు. తాండూరులో కాంగ్రెస్ జెండా ఎగురవేయడం ఖాయమని దీమా వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో చాపల వెంకటయ్య, తలారి రాములు, ముదిని నర్సిములు, తాడి నరేందర్, ముదిని వెంకటయ్య, మంగలి రాములు, మంగలి నర్సిములు పాల్గొన్నారు.

**పలు తండాలలో :** బిఆర్ఎస్ పాలనలో ప్రజలు విసుగు చెందారని, తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని యువనాయకుడు రుద్రారం మహిపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం పెద్దేముల్ మండలం ఓంలానాయక్ తాండా, రచ్చకట్టతాండా, జయరాంతాండా తదితర గ్రామాలలో మాజీ సర్పంచ్‌లు శివరాం, బాబుసింగ్, పీఏసిఎస్ డైరెక్టర్ హన్మంతుతో కలిసి ఆయన ప్రచారం నిర్వహించారు.

## హస్తం గుర్తుకు ఓటు వేసి మల్‌రెడ్డి రంగారెడ్డిని గెలిపించాలి

**-సహకార సంఘం మాజీ వైస్ చైర్మన్ లిక్కి శ్రీనివాస్ రెడ్డి**



**యాచారం నవంబరు27,ప్రభాతవార్త :** మండల పరిధిలోని చింతపట్లలో సోమవారం అధిక మెజార్టీ కోసం కృషి చేయాలని వ్యవసాయ సహకార సంఘం మాజీ వైస్ చైర్మన్ లిక్కి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డికి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు.పేద ప్రజల కోసం కాంగ్రెస్ అధిష్టానం 6 గ్యారంటీ పథకాలను తీసుకొచ్చిందని గుర్తు చేశారు.గతంలో ఇందిరమ్మ పేరుతో ఊరూరా ఇండ్లు నిర్మించిందని ప్రజలంతా హస్తం గుర్తును మరువద్దని సూచించారు.వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేశారని వివరించారు.మళ్లీ తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం రావాలని పేద ప్రజలంతా కోరుకుంటున్నారని పేర్కొన్నారు.పేదలకు ఇండ్లు ,రేషన్ కార్డులను ఇవ్వడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని తెలియజేశారు.రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.ప్రజలంతా హస్తం గుర్తుకు ఓటేసి అధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి,లక్ష్మారెడ్డి,కేసరి అమృత సాగర్,దొడ్ల గిరి,సుధాకర్ రెడ్డి,రంగారెడ్డి,బొమ్మటి శేఖర్,అజయ్, విజయ్, ఇబ్రహీం,తదితరులు పాల్గొన్నారు.

## మరకత శివాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కార్తీక పౌర్ణమి పూజలు

**శంకర్‌పల్లి, నవంబర్ 27 ప్రభాతవార్త:** కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని శివాలయాల్లో భక్తులు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం నాడు చెందిప్ప మరకత శివాలయంలో శంకర్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ సాత విజయలక్ష్మి ప్రవీణ్‌కుమార్ ప్రత్యేక పూజలు చేశారు. శివునికి అభిషేకం చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆ శివయ్య అనుగ్రహంతో ప్రజలంతా సుఖ సంతోషాల తో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు, పాల్గొన్నారు.



చెందిప్ప మరకత శివాలయంలో ప్రత్యేక పూజలు చేసిన శంకర్‌పల్లి మున్సిపల్ చైర్మన్ సాత విజయలక్ష్మి ప్రవీణ్‌కుమార్